సర్పంచులపై కూటమి పంజా



- పంచాయతీల అనుమతులు లేకుండా పనులు

కార్వేటినగరం: పంచాయతీలకు ప్రథమ పౌరులుగా భావించే సర్పంచులకు కూటమి ప్రభుత్వంలో విలువ లేకుండా పోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లె పండుగ పేరుతో ఒక్క రోజు గ్రామ సభలు నిర్వహించి గ్రామాల అభివృద్ధి పేరుతో సర్పంచ్‌లను బెదిరించి సంతకాలు పెట్టించుకున్నారు. ఈ వైనంపై జీడీ నెల్లూరు నియోజకవర్గంలో విమర్శల వెల్లువెత్తుతున్నాయి. కొన్ని పంచాయతీలలో కనీసం సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా దౌర్జన్యం కొనసాగుతోంది. కొన్ని పంచాయతీలలో అభివృద్ధిని అడ్డుకోలేక సంతకాలు చేయాల్సి వచ్చిందని పలువురు సర్పంచులు ఆరోపిస్తున్నారు. గంగాధరనెల్లూరు మండలంలో 39 పనులకు రూ.87.18 కోట్లు మంజూరయ్యాయి. కార్వేటినగరం మండలంలో 33 పనులకు రూ.84.85 కోట్లు, పెనుమూరు మండలంలో 66 పనులకు రూ.81.82 కోట్లు, శ్రీరంగరాజపురం మండలంలో 23 పనులకు రూ.69.57 కోట్లు, వెదురుకుప్పం మండలంలో 60 పనులకు రూ.81.67 కోట్లు, పాలసముద్రం మండలంలో నాలుగు పనులకు రూ.70.18 లక్షల నిధులతో పనులు చేపట్టారు. అయితే సర్పంచు పేరుకే ప్రథమ పౌరులన్నట్లు కూటమి నాయకులు వ్యవహరిస్తున్నారు. ఇష్టారీతిన టీడీపీ నాయకులకు పనులు కట్టబెడుతున్నారు. ఇక పనుల్లో నాణ్యత నారాయణుడికే ఎరుక.

టీడీపీ నాయకుల ఇష్టారాజ్యం



గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్డు నిర్మాణాల్లో కూటమి నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కనీసం సర్పంచుల అనుమతులు లేకుండా రోడ్లను ప్రజలకు అవసరమైన చోట్ల నిర్మించలేదు. నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు పిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టారు. నిజంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న చోట్ల రోడ్డు నిర్మాణాలు చేపట్టేందుకు మొగ్గు చూపలేదు. కేవలం ఏదో పనులు చేసి బిల్లులు పొందాలన్న దురాలోచన తప్ప ప్రజాప్రయోజనం ఎక్కడా కనిపించడం లేదు.

– కె.భారతి, సర్పంచుల సంఘం అధ్యక్షురాలు, వెదురుకుప్పం

పంచాయతీ అభివృద్ధికి సహకరించాం



పంచాయతీ నిధులతో కూటమి నాయకులు సర్పంచుల అనుమతులు లేకుండా సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు యత్నిస్తున్నారు. అయితే పంచాయతీ ప్రజల కోసం రోడ్ల నిర్మాణం చేస్తున్నారు. అందుకే పంచాయతీ అభివృద్ధికి అడ్డు పడకుండా సహకరించాల్సి వచ్చింది. అయితే టీడీపీ నాయకులు ఇష్టానుసారం పనులు చేస్తున్నారు. నాణ్యత లేకుండా పనులు నామమాత్రంగా పూర్తి చేసి, డబ్బులు సంపాదించుకోవాలని చూస్తున్నారు.

– ధనుంజయవర్మ, సర్పంచ్, కార్వేటినగరం

క్లుప్తంగా

అగరంలో పశువైద్య శిబిరం



వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారులు

నింద్ర: పశు వైద్య శిబిరం ద్వారా ప్రతి గ్రామంలో పాడి రైతులు తమ పశువులకు వైద్య సేవలు పొందాలని మండల పశు వైద్యాధికారి సాయి సంధ్య అన్నారు. మండలంలోని అగ రం గ్రామంలో సోమవారం నిర్వహించిన వై ద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ పశువులకు వైద్య సేవలు నిర్వహించడంతో పశువులకు వివిధ రోగాలను నయం చేయవచ్చునని అన్నారు. అదేవిధంగా వివిధ రోగాలను అరికట్టేందుకు పాడి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ముమ్మరంగా పెన్షనర్ల తనిఖీ



తనిఖీ చేస్తున్న వైద్యులు, ఎంపీడీఓ

శ్రీరంగరాజపురం: మండలలో మంచానికి పరిమితమైన పెన్షనన్ల తనిఖీని అధికారులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి వైద్యాధికారులు, ఎంపీడీఓ మోహన్‌మురళి తనిఖీలు చేపట్టారు. సదరం సర్టిఫికెట్లు, దీర్ఘకాలిక రోగులకు సంబంధించి ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా అనర్హులైన పింఛనుదారులను తొలగించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, ఉమాదేవి పాల్గొన్నారు.

వేడుకగా మహా కుంభాభిషేకం



ఆలయంలో కుంభాభిషేకం

నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామంలో ఉన్న పురాతన కామాక్షి సమేత బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకం సోమవారం నిర్వహించారు. ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ మహా కుంభాభిషేకం నిర్వహించారు. పురాతన ఆలయాన్ని గ్రామంలో తిరిగి ప్రారంభించడంతో గ్రామంలో ప్రజలకు స్వామి దర్శన భాగ్యం కల్పించామన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రూ.2.91లక్షలకు చెరువుల వేలం



కార్వేటినగరంలో వేలంపాట

కార్వేటినగరం : పంచాయతీ పరిధిలోని చెరువుల్లో చేపల వేలం ద్వారా రూ. 2.91 లక్షల ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ ధనుంజయ వర్మ తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఈఓ నాగరత్నమ్మ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ నగరం చెరువుకు రూ.1.96లక్షలు, స్వామివారి పాదం చెరువుకు రూ.24 వేలు, కుమ్మరగుంటకు రూ.13.5వేలు, దొరవారిగుంట రూ.50 వేలు, కసవరాజుగుంట రూ.7.5వేలు వచ్చినట్లు వివరించారు. ఈ నగదును పంచాయతీలో అభివృద్ధి పనులకు వెచ్చించనున్నట్లు తెలిపారు.

వడమాలపేటలో ఆధార్ సెంటర్

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం, ఏఎంపురం, అప్పలాయగుంట సచివాలయం పరిధిలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శేషాగిరి రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21, 22 ఏఎంపురం, 23, 24 అప్పలాయగుంట సచివాలయాల పరిధిలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆయా సచివాలయాల పరిధిలో 0–6 వయస్సు కలిగిన పిల్లలందరికీ అంగన్‌వాడీ సూపర్‌వైజర్, టీచర్లు, వర్కర్లు ఆధార్ కార్డు చేయించాలని ఆయన సూచించారు.

వేపచెట్టు నుంచి పాలధార



వేపచెట్టు నుంచి కారుతున్న పాలధార

నగరి: మున్సిపల్ పరిధిలోని కాకవేడు గ్రామం శీతలాంబ ఆలయం సమీపంలోని వేప చెట్టు నుంచి సోమవారం అకస్మాత్తుగా పాలు కారుతుండడం స్థానికులను ఆశ్చర్యానికి గురి చేసింది. వింతను చూడడానికి జనం చెట్టు వద్దకు పరుగులు తీశారు. అమ్మవారి అనుగ్రహం అంటూ మహిళలు పసుపు, కుంకుమ అద్ది చెట్టుకు మొక్కుకున్నారు.

ఆర్‌కేవీబీపేటలో అన్నీ అవస్థలే



రోడ్డుపై నిలిచిన మురుగును చూపుతున్న గోవర్ధన్‌రెడ్డి

కార్వేటినగరం: మండలంలోని ఆర్‌కేవీబీపేటలో ప్రజలకు అన్నీ అవస్థలే మిగిలాయని కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి ఎం.గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం గ్రామంలో ఆయన పర్యటించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్నా పాలనలో వేగం రాలేదన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా దెబ్బతిందని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వేసిన వీధిదీపాలను సైతం టీడీపీ నేతలు ఆర్పివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సర్కారుపై విమర్శలు గుప్పించిన టీడీపీ నేతలు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ పనులు దక్కించుకోవడంలో చూపిన శ్రద్ధను ప్రజా సమస్యల పరిష్కారంపై చూపడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఆర్‌కేవీబీపేటలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఓదార్పు



నగరి: మునస్వామి మృతదేహానికి నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి



పుత్తూరు: కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయినప్పుడే మనోధైర్యంతో ముందుకెళ్లాలని వైఎస్ఆర్ సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం పుత్తూరు మండలం కైలాసపురం గ్రామ వైఎస్ఆర్ సీపీ నాయకుడు జేసీఎస్ మాజీ మండల కన్వీనర్ భాస్కర్‌యాదవ్ సోదరుడు జానకిరామ్ యాదవ్ ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న రామ్‌ప్రసాద్‌రెడ్డి గ్రామానికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

వైఎస్ఆర్ సీపీ నేతకు ఘన నివాళి

నగరి: మండలంలోని వీకేఆర్ పురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నేత మునస్వామి ఆకస్మికంగా మరణించారు. సోమవారం మృతుని నివాసం వద్దకు చేరుకున్న మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ఆయన కుమారుడు వైఎస్ఆర్ సీపీ యువనేత బాలాజీని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముళ్లతీగల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



శ్రీరంగరాజపురం : మండలంలోని ట్రాన్స్‌ఫార్మర్లకు అల్లుకున్న ముళ్ల తీగలపై «పచ్చతోరణం అనుకుంటే పొరపాటే» శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. సోమవారం ఈ మేరకు ఏఈ విజయశేఖర్ మాట్లాడుతూ ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి ముళ్ల తీగలు ఉంటే తొలగించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ క్రమంలో సిబ్బంది చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

నట్టల నివారణతో వ్యాధి నిరోధక శక్తి



పశువులకు వైద్యం అందిస్తున్న డాక్టర్

విజయపురం: నట్టల నివారణ మందుతో మూగ జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని మండల పశు వైద్యాధికారి శివమూర్తి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి, పశువులకు వైద్యం అందించారు. ఈ సందర్భంగా నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. ఈ మందు ద్వారా మరణాలు తగ్గి, జీవాల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

23న వార్షిక మహోత్సవం

కొండల్లీశ్వర స్వామి ఆలయంలో 23వ తేదీన 11వ వార్షిక మహోత్సవ నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. ఈ మేరకు మహా చండీ హోమం, విశిష్ట పూజలు జరిపించనున్నట్లు వెల్లడించారు.

పల్లెల్లో పశువైద్య శిబిరాలు

పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలోని గుంటిపల్లె, పెరుమాళ్లపల్లెలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశు వైద్యాధికారి సుబ్రమణ్యం మాట్లాడుతూ 220 పశులు, 1,200 జీవాలకు నట్టల నివారణ మందులు అందించినట్లు వెల్లడించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్లు తెలిపారు. అలాగే పశువులకు పిడుదుల నివారణ మందు పిచికారీ చేయించినట్లు వివరించారు.

శ్రీరంగరాజపురం : మండలంలోని పాతపాళ్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి శ్రీవిద్య మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు శిబిరాలు జరుగుతాయని వెల్లడించారు. పశు వైద్య అసిస్టెంట్ డైరెక్టర్ రూపాసుందరి పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు : వింజం పంచాయతీలో పశు సంవర్ధకశాఖ ఏడీ మురళీమోహన్, సర్పంచ్ రామక్క ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా 319 పశులకు చికిత్సలందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోవిందన్, వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ , యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ దివ్య, సిబ్బంది బాబు, వంశీ ప్రసాద్ పాల్గొన్నారు.



పశువులకు మందు పిచికారీ చేస్తున్న వైద్యసిబ్బంది



శిబిరం ప్రారంభిస్తున్న ఏడీ మురళీ మోహన్, సర్పంచ్ రామక్క

జాబ్ మేళాలో 31 మంది ఎంపిక

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 31 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సిడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో మొత్తం 94 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 31 మంది ఎంపికైనట్లు వివరించారు. ప్రముఖ కంపెనీలైన టెక్ మహీంద్ర, డిక్సన్, అపోలో ఫార్మసీ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చైతన్య, కళాశాల స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ రసూల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్య లేకుండా చూడండి

నింద్ర: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం సమస్య లేకుండా చూడాలని ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ అన్నారు. సోమవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయడం, రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించే కార్యక్రమాలు, తాగునీరు లీకేజీ లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలు తమ ఇంటి వద్ద కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. రోగాలు రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి

పాలసముద్రం : ఎస్టీ కాలనీలో సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం సన్న గుంట ఎస్టీ కాలనీలో ఆయన పర్యటించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఆధార్, జాబ్ కార్డు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జాబ్ కార్డు ఉంటే ఏటా 100 రోజులు ఉపాధి కింద పనులు చేసుకోవచ్చని తెలిపారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు వినతులు సమర్పిస్తే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు. పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, హౌసింగ్ ఏఈ దాము, ఏపీఓ మార్గరేట్ పాల్గొన్నారు,

వైద్యాధికారిగా అస్మా అంజుమ్



గంగాధరనెల్లూరు: మండల హోమియోపతి వైద్యాధికారిగా అస్మా అంజుమ్ సోమవారం వింజం పంచాయతీ సిద్ధేశ్వర కొండ హోమియోపతి హాస్పిటల్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తామని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



బాలాజీని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కార్వేటినగరం: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పార్టీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షులు యశోదారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీపీ లతాబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుని, పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శేఖర్‌రాజు మాట్లాడుతూ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కృపాలక్ష్మిని రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించుకుని జగనన్నకు కానుకగా అందించేందుకు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. సూపర్ సిక్స్ పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసిన శ్రీరాములునాయుడు కుటుంబానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక ప్రాధన్యత కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. శ్రీరాములునాయుడి తనయుడు బాలాజీకి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా పదవిని అందించడం ఆనందంగా ఉందన్నారు. బాలాజీ మాట్లాడుతూ తన తండ్రి శ్రీరాములు నాయుడు చేసిన సేవలే నేడు తనను ఈ స్థాయికి తీసుకువచ్చాయని తెలిపారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కళత్తూరు నారాయణస్వామి, అలాగే జీడీ నెల్లూరు సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మికి ఎప్పటికీ రుణపడి ఉంటానని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాలాజీని ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, పురందర్, శేషాద్రి, లోకనాథరెడ్డి, చందురాజు,శ్రీనివాసులు, దేశయ్య, పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి (పెనుమూరు)దూదిమోహన్, దాము, పట్టాభిరెడ్డి, ఆకుల గోపి, మునికృష్ణ,సుబ్రమణ్యం, శ్రీనివాసులురెడ్డి, మురగయ్య, వెంకటేష్, అన్బుఅళగన్, శివప్రకాష్, విజయకుమార్, మోహన్‌కుమారి, సుమతి, అంబిక, రాజారెడ్డి, రోశిరెడ్డి పాల్గొన్నారు.

మెనూ మేరకే 'భోజనం'



భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ గిరిజ

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓ గిరిజ ఆదేశించారు. సోమవారం వెంగళరాజుకుప్పం ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. పప్పు, కూరగాయలు, గుడ్లు సక్రమంగా పెట్టాలని తెలిపారు. బియ్యాన్ని మంచి నీటితో కడిగిన తర్వాతే అన్నం వండాలని సూచించారు. రసం, సాంబార్ తయారీలో అయోడిన్ ఉప్పునే వాడాలని కోరారు. విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో త్వరగా పెట్టాలని స్పష్టం చేశారు. అనంతరం పిల్లలకు వడ్డిస్తున్న భోజనం రుచి చూశారు. హెచ్‌ఎం జాన్‌వీసన్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత పులిగుండు జట్టు



క్రీడాకారులతో మహసముద్రం సురేష్‌రెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం) : మండలంలోని పులిగుండులో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీలో సోమవారం ఫైనల్స్ జరిగాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పులిగుండు జట్టు విజేతగా నిలిచింది. మహా సముద్రం దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన టోర్నీలో విజేత జట్టుకు రూ.30వేలు, రన్నర్ జట్టు గుంటిపట్లె, కనికాపురం జట్టకు రూ.17,500 అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ మహాసముద్రం సురేష్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షణ్ముగం. సుబ్రమణ్యంరెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నగరి డీఎస్పీగా సయ్యద్ మొహమ్మద్ అజీజ్



సయ్యద్ మొహమ్మద్ అజీజ్

నగరి: సబ్ డివిజన్ డీఎస్పీగా సయ్యద్ మొహమ్మద్ ఆజీజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2022 బ్యాచ్‌కు చెందిన డీఎస్పీలకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఆయన కర్నూలు జిల్లా నుంచి నగరి సబ్ డివిజన్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి సబ్ డివిజన్‌లో శాంతిభద్రతలను కాపాడుతామని, ప్రత్యేకంగా గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాలు తగ్గించడం తదితర ప్రధాన అంశాలపై దృష్టి పెడతానన్నారు. సమాజంలో నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.

కుష్టు వ్యాధి లక్షణాలపై అవగాహన

విజయపురం: చర్మంపై స్పర్శ లేని, రాగి రంగు కలిగిన మచ్చలు ఉంటే అవి కుష్టువ్యాధి లక్షణాలు కావచ్చని, వెంటనే సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సోమశేఖర్ సూచించారు. సోమవారం జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో అవగాహన కల్పించారు. బస్టాండు నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.